రోడ్డు విస్తరణకు మార్గం సుగమం



విస్తరణ పనుల్లో భాగంగా చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు



రోడ్డు విస్తరణకు కొలతలు తీసుకుంటున్న జీవీఎంసీ సిబ్బంది

- 'కూర్మన్నపాలెం – దువ్వాడ' రోడ్డు 100 అడుగులకు విస్తరణ
- రూ.11.39 కోట్లతో నిర్మాణం
- ఎమ్మెల్యే చొరవతో కార్యరూపం
- వాహనచోదకుల హర్షం

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం, దువ్వాడ ప్రజల చిరకాల కోరిక 100 అడుగుల రోడ్డు విస్తరణ. నాలుగేళ్ల కిందటే ప్రభుత్వం విస్తరణ పనులకు పచ్చజెండా ఊపినా.. మారిన ప్రణాళికలు, ఇతర కార్యక్రమాల వల్ల ఆలస్యమైన రోడ్డు విస్తరణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. కూర్మన్నపాలెం – దువ్వాడ మార్గంలో 1.6 కిలోమీటర్ల మేర 100 అడుగుల రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వం 11.39 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. ఇప్పటికే విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఖాళీ చేయించడంతో పాటు, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు కాగితాలకే పరిమితమైన పనులు కార్యరూపం దాల్చడంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి డిసెంబరు చివరి నాటికి రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు.

ఎమ్మెల్యే కృషితో.. : దాదాపు రెండు దశాబ్దాలుగా కూర్మన్నపాలెం–దువ్వాడ రహదారి విస్తరణ ప్రతిపాదన ఉంది. గత ప్రభుత్వ హయాంలో ప్రణాళికలు రూపొందించినా.. ఆశించిన విధంగా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. దీంతో రోడ్ల విస్తరణ పనులు కాగితాలకే పరిమితమయ్యాయి. 2019 ఎన్నికల్లో గాజువాక ఎమ్మెల్యేగా గెలిచిన తిప్పల నాగిరెడ్డి పట్టుదలతో రోడ్డు విస్తరణ పనుల కోసం పదేపదే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో రోడ్డు విస్తరణ పనులు పట్టాలెక్కాయి. విస్తరణ పనులు చురుగ్గా జరుగుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



100 అడుగుల రోడ్డు విస్తరణ పనులు

రోడ్డు విస్తరణ అత్యంత అవసరం

కూర్మన్నపాలెం – దువ్వాడ రహదారిలో వాహనాల రద్దీ ఎక్కువ. ముఖ్య పరిశ్రమలైన స్టీల్‌ప్లాంట్, వీఎస్ఈజెడ్, ఇతర ఫార్మా కంపెనీలతో పాటు దువ్వాడ రైల్వే స్టేషన్ కూడా ఇదే మార్గం కావడం .. రద్దీకి అనుగుణంగా రోడ్లు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. తరచూ ప్రమాదాలు కూడా జరుగుతుండడంతో విస్తరణ అనివార్యమని భావించి, ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. నిరీక్షణ ఫలించి, రహదారి విస్తరణకు నిధులు మంజూరు కావడంతో పలు వర్గాల ప్రజల నుంచి సంతోషం వ్యక్తమవుతోంది. కాగా.. రహదారి విస్తరణలో ఎవరూ నష్టపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం



గత ప్రభుత్వ హయాంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగుల రహదారిని 100 అడుగులకు విస్తరించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కానీ పనులు మాత్రం జరగలేదు. ఎమ్మెల్యే నాగిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టడంతో కూర్మన్నపాలెం–దువ్వాడ 100 అడుగుల రోడ్డు విస్తరణ పనులు చకచకా సాగుతున్నాయి. రోడ్డు విస్తరణతో స్థానికంగా ట్రాఫిక్ సమస్యలతో పాటు నగరాభివృద్ధి కూడా జరుగుతుందని ఆశిస్తున్నాం.

– దామా సుబ్బారావు, 86వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి

క్లుప్తంగా

నిరుపేదలకు వితరణ



పేద కుటుంబాలకు సరకులు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: అగనంపూడి పరిసర ప్రాంతాల్లో సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని విశాఖ ఉక్కు కో–ఆపరేటివ్ స్టోర్స్ మాజీ అధ్యక్షుడు కాసా పద్మరాజు అన్నారు. పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ 75 మంది నిరుపేదలకు రూ.200 చొప్పున పింఛన్లు అందించింది. అలాగే పద్మరాజు సహకారంతో రెండు నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా బియ్యం ఇతర నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో ఉక్కు విశ్రాంత ఉద్యోగులు బి.చక్రవర్తి, బొండా ఈశ్వరరావు, ట్రస్ట్ సలహాదారు పట్టా రామ అప్పారావు, వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మస్తాన్‌రెడ్డి, జామి గణేష్, కిడిమి హనుమంతురావు పాల్గొన్నారు.

కాన్షీరాం సేవలు మరువలేం



కాన్షీరాం చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: బహుజన సమాజ్ వాదీ పార్టీ నిర్మాత కాన్షీరాం సేవలు మరువలేమని బర్మా ఆంధ్ర బౌద్ధ సంఘం కన్వీనర్ బోర వేణుగోపాల్ గౌతమ్ అన్నారు. కాన్షీరాం వర్ధంతిని పురస్కరించుకుని పెదగంట్యాడలోని ఎస్సీ కాంప్లెక్స్ వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, ములకలపల్లి చిన్నారావు, కొరమాటి అన్నవరం, సిద్ధార్థ, పైడికొండ, వెంకటేష్ పాల్గొన్నారు.

చదువుతో పాటు విలువలు అవసరం



మాట్లాడుతున్న విజ్ఞాన్ రెక్టార్ మధుసూదనరావు

అగనంపూడి: విద్యార్థులు చదువుతో పాటు ఉన్నత విలువలు కలిగి ఉండాలని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. విజ్ఞాన్ ఎంబీఏ, ఎంసీఏ మొదటి సంవత్సరం విద్యార్థులతో సోమవారం ఆయన మాట్లాడారు. విద్యార్థులు బోధనా సమయాన్ని సద్వినియోగపరచుకుంటే కళాశాల విడిచి వెళ్లేటప్పుడు ఆనందంగా వెళ్తారన్నారు. కళాశాల విడిచిపెట్టే సమయానికి మంచి ఉద్యోగాలతో బయటికి వెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ చార్జీలు తగ్గించాలి'



ధర్నాలో పాల్గొన్న సీపీఐ నాయకులు

గాజువాక : పెరిగిన విద్యుత్ చార్జీలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. కొత్త గాజువాక జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ గాజువాక కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ పెరిగిన చార్జీలతో ప్రజలపై ఆర్థిక భారం పెరిగిందన్నారు. చిరువ్యాపారులు మరింత ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా విద్యుత్ చార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో తమ ఆందోళనను ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్, తాండ్ర కనకరాజు, కె.అచ్యుతరావు, పల్లేటి పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

970వ రోజుకు ఉక్కు పరిరక్షణ ఉద్యమం

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కార్మికులు పట్టు వదలక చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం 970వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రప్రభుత్వం అమ్ముకుంటూపోతే దేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థ మిగలదన్నారు. ఇప్పటికే దేశంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాక, నిరుద్యోగ సమస్యతో యువత వ్యసనాలకు బానిసలవుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో నవంబరు 2, 3, 4 తేదీల్లో ద్రవ స్ఫటికాలపై నిర్వహించే మూడు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల శాస్త్రవేత్తలు, పరిశోధకులు 250 మందికిపైగా హాజరై తమ పరిశోధన పత్రాలను సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య కె.బసవయ్య, కన్వీనర్ డాక్టర్ రామకృష్ణ నాంచార రావు, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య శ్రీనివాసరావు, ఆచార్య రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా సింహాచలేశుని నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష .. పేదలకు వరం

- జోనల్ కమిషనర్ సింహాచలం
- నమ్మిదొడ్డి యూపీహెచ్‌సీలో శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ సింహాచలం



రోగుల వివరాలు నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

పెదగంట్యాడ: ప్రజల ఆరోగ్యమే పరమావధిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం అన్నారు. అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. జీవీఎంసీ 77వ వార్డు నమ్మిదొడ్డి యూపీహెచ్‌సీలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న మంచి ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమం పేదలందరికీ ఓ వరమని అన్నారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో ప్రజలకు ఇళ్ల వద్దే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మాదిరిగా వైద్యం అందుతోందని అన్నారు. శిబిరాల్లో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, ఆరోగ్య సమస్యలున్న వారికి ఉచితంగా మందులు అందిస్తారని, శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రిఫర్ చేసి రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తుందని తెలిపారు. ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

937 మందికి వైద్య సేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 10మంది వైద్యులు సేవలు అందించారు. శిబిరానికి వచ్చిన 937 మందికి రక్త పరీక్షలు, ఇతర పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, డాక్టర్ జీవన్‌రాణి, ప్రదీప్ ప్రసాద్‌రాజా, భరద్వాజ్, రవీంద్ర, రమేష్‌బాబు, హేమలత, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంతోనే పర్యావరణ పరిరక్షణ

ఏయూ క్యాంపస్: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను నిషేధించడం తప్పనిసరని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం ఆధ్వర్యంలో మైక్రో ప్లాస్టిక్స్ ఇన్ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ అంశంపై నిర్వహించిన మూడు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. ప్లాస్టిక్ కాలుష్యం కారణంగా సముద్ర జీవులకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. యూరోపియన్ కమిషన్ అందించిన ప్రాజెక్టులో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 25 మంది పరిశోధకులు, అధ్యాపకులు, సహాయ ఆచార్యులు, మత్స్యశాఖ, జీవీఎంసీ అధికారులు ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్, డాక్టర్ కె.ఉమాదేవి, విభాగ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న రెక్టార్ ఆచార్య సమత

అన్నప్రసాద పథకానికి విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం నగరానికి చెందిన బి.అశ్విని, సురేందర్‌రెడ్డి దంపతులు రూ. లక్ష విరాళం ఇన్‌చార్జి ఏఈవో పాలూరి నరసింగరావుకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు.



దాతలకు ప్రసాదం అందజేస్తున్న ఏఈవో నరసింగరావు

గుడివాడ గుర్నాధరావు జయంతికి ఏర్పాట్లు

అక్కిరెడ్డిపాలెం: మాజీ మంత్రి, దివంగత గుడివాడ గుర్నాధరావు 68వ జయంతిని బుధవారం ఉదయం 10 గంటలకు 68వ వార్డు మింది జెడ్పీ హైస్కూల్ పక్కనున్న గుడివాడ గుర్నాధరావు విగ్రహం వద్ద నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ తెలిపారు. మిందిలోని గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుడివాడ అప్పన్న కల్యాణ మండపం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన పార్క్‌ను రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా శౌర్య జాగరణ యాత్ర



యాత్రలో పాల్గొన్న భక్తులు, నాయకులు

గాజువాక : విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ షష్టబ్ది మహోత్సవాలలో భాగంగా గాజువాకలో సోమవారం శౌర్య జాగరణ యాత్రను నిర్వహించారు. పాతకర్ణవానిపాలెంలోని రామాలయం వద్ద ఈ యాత్రను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు దంపతులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హైందవ సంస్కృతి, సంప్రదాయం, ఆలయాల విశిష్టత గురించి ప్రజలకు వివరించాలన్న ఉద్దేశంతో ఈ యాత్రను చేపట్టినట్టు చెప్పారు. 1964లో ప్రారంభమైన విశ్వ హిందూ పరిషత్ వచ్చే ఏడాదికి 60 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా శౌర జాగరణ యాత్ర 15 రోజుల పాటు సాగుతుందన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నగర సంయుక్త కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఉక్కు నగరం ప్రధాన కార్యదర్శి భాస్కరరాజు, ప్రతినిధులు వాసుబాబు, భాస్కరభట్ల శర్మ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్ మేళా విజయవంతం

499 మంది విద్యార్థుల ఎంపిక



మాట్లాడుతున్న ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు



మేళాకు హాజరైన విద్యార్థులు

పెదగంట్యాడ: ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు అప్రెంటిస్‌షిప్‌ను కూడా విజయవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీలో సోమవారం నిర్వహించిన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళాను ఆయన ప్రారంభించారు. అప్రెంటిస్‌షిప్ పూర్తయిన వారికి పరిశ్రమల్లో ఉద్యోగాలు వస్తాయన్నారు. ఈ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేళాలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఎస్ఆర్ఎంటీ, హ్యుండాయ్ మోటార్స్, దేవి ఇంజినీరింగ్స్, ఎండీ ఎలక్ట్రికల్స్, లోహిత ట్రాన్స్‌ఫార్మర్స్ తదితర కంపెనీలు పాల్గొన్నాయి.

ఈ మేళాకు మొత్తం 650 మంది విద్యార్థులు హాజరు కాగా 499 మంది విద్యార్థులను వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఎంపిక చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. మొత్తం 6 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో వి.సత్యనారాయణ, కుమారి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో 'ఉక్కు' మహిళల ప్రతిభ

ఉక్కునగరం: విశాఖ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఉక్కునగరం మహిళలు యు.అంజలి, పి.రోజాకుమారి, పి.సంధ్యారాణి, సంధ్యా సాహు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీస్ బ్యారెక్స్‌లో ఆదివారం పలు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉక్కునగరానికి చెందిన యు.అంజలి 55+ కేటగిరీలో డిస్కస్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో ప్రథమ బహుమతులు గెలుపొందారు. 50+ కేటగిరీలో పి.రోజా కుమారి 5 కిలో మీటర్ల నడక పోటీలో, షాట్‌పుట్ పోటీల్లో ప్రథమ బహుమతులు కైవసం చేసుకున్నారు. 50+ కేటగిరీ పోటీల్లో పి.సంధ్యారాణి 5 కిలోమీటర్ల నడక పోటీల్లో ప్రథమ బహుమతి గెలుపొందారు. 40+ కేటగిరీ పోటీల్లో సంధ్యా సాహు డిస్కస్ త్రో, షాట్‌పుట్‌లో ప్రథమ బహుమతులు కైవసం చేసుకున్నారు. వీరు నలుగురు డిసెంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి టి.వెంకటాద్రి తెలిపారు.



షీల్డులు అందుకుంటున్న అంజలి, రోజాకుమారి, సంధ్యారాణి, సంధ్యాసాహు

'బీజేపీది కపట నాటకం'

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై బీజేపీది కపట నాటకమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ విమర్శించారు. మోదీ నిరంకుశ పాలనకు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న దీక్షలు సోమవారానికి 921వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం మూడు సంవత్సరాలుగా ఉద్యమం జరుగుతున్నా మోదీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు, ప్రజల ఆస్తులను బీజేపీ భక్తులైన బడా పారిశ్రామిక వేత్తలు అంబానీ, ఆదాని, వేదాంత తదితరులకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వంపై ప్రజలకు రోజురోజుకూ అసహనం పెరిగిపోతోందన్నారు. నిరంకుశ పద్ధతుల ద్వారా కార్మిక, ప్రజా ఉద్యమాలు అణచివేస్తే ప్రభుత్వాలు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలను ఆపాలని, లేనిపక్షంలో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎం.మన్మధరావు, కోట సత్తిబాబు, కె.సత్యనారాయణ, లింగాల వెంకటేష్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవడం తప్పనిసరి

ఏయూ క్యాంపస్: సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎన్‌టీపీసీ సింహాద్రి హెచ్‌వోపీ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్‌లో ఎన్‌టీపీసీ అధికారులకు నిర్వహిస్తున్న లీడర్‌షిప్ కోర్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిలో పరిణితి సంస్థ అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు వ్యక్తి ఉన్నతికి ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. ఐఐఎం విశాఖపట్నం ఇటువంటి కార్యక్రమాలను విస్తృతగా నిర్వహించాలన్నారు. నిర్వహణ సామర్థ్యాలను పెంపొందించుకునే విధంగా ఈ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎన్‌టీపీసీ హెచ్‌ఆర్ విభాగాధిపతి రుమా డి.శర్మ మాట్లాడుతూ ఇటువంటి ప్రత్యేక కోర్సులు సంస్థలో పనిచేసే ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ఐఐఎం పరిపాలన విభాగం డీన్ ఆచార్య ఎం.వి.అనూరాధ మాట్లాడుతూ భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దడానికి, సంస్థ ప్రగతికి దోహదపడే వ్యక్తులుగా తమ సిబ్బందిని మలచడానికి ఇటువంటి ప్రత్యేక కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఎం సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్, ప్రోగ్రాం డైరెక్టర్ ఆచార్య విశాల్ సింఘ్ పట్యాల్, తదిరతులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన ఎన్‌టీపీసీ అధికారులతో ఐఐఎం అధికారులు

అందరి సహకారంతో కాలుష్య నియంత్రణ

డాబాగార్డెన్స్: కాలుష్య నిర్మూలనకు నగర పౌరులందరూ సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. నగర కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీ కార్యాలయానికి సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. సాధ్యమైనంత వరకు ప్రజా రవాణా, కాలుష్య రహిత వాహనాలు వినియోగించాలని, మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.



సైకిల్‌పై కార్యాలయానికి చేరుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ